క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఇసుక ట్రాక్టర్

లింగసముద్రం: మండలంలోని వీఆర్ కోట వద్ద ఉన్న మన్నేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై షేక్ మహబూబ్ సుభాని చెప్పారు. మంగళవారం తెల్లవారుజామున వీఆర్ కోట వద్ద ఉన్న మన్నేరు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు డయల్ 100 కు ఫోన్ చేయడంతో అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి ఇసుక లోడుతో వెళుతున్న ఇసుక ట్రాక్టర్‌ను వెంబడించి పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు అభ్యసన సామగ్రి అందజేత



విద్యార్థులకు అభ్యసన సామగ్రి అందజేస్తున్న హెచ్‌ఎం, దాత

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు పాఠశాల పూర్వవిద్యార్థి విద్యాభ్యాసన సామగ్రి సమకూర్చి అందజేయడం అభినందనీయమని సీఎస్‌పురం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌యం షేక్.ఖాదరున్నీసాబేగం అన్నారు. పాఠశాలలో 1997–2002 విద్యాసంవత్సరాల్లో చదువుకున్న పూర్వవిద్యార్థి ఎ.మహేంద్రనాయుడు రూ.50 వేల విలువైన విద్యా సామగ్రిని మంగళవారం హెచ్‌ఎం చేతుల మీదుగా పంపిణీ చేశారు. జి.నరేంద్ర, కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయాలి



రికార్డులు తనిఖీచేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజన

సీఎస్‌పురం(పామూరు): ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓడాక్టర్ ఏ సుజన అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు మండలంలోని డీజీపేట విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆకస్మిక తనిఖీచేశారు. రికార్డులను పరిశీలించిన ఆమె సూచనలు చేశారు. వైద్యసిబ్బంది గ్రామాల్లో పర్యటించి ఎక్కడా మురికినీటి నిల్వలు లేకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన చే యాలని సూచించారు. డాక్టర్ సందిరెడ్డి మురళి, డాక్టర్ హోమద్యుతి, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



సీమంతం జరిపిస్తున్న సూపర్‌వైజర్ సునీత తదితరులు

వలేటివారిపాలెం: గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత అన్నారు. వలేటివారిపాలెం సెక్టర్ 2 పరిధి చెర్లోపాలెం గ్రామంలో 7వ రాష్ట్రీయ పోషణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ రక్తహీనత, పెరుగుదల పర్యవేక్షణ, అనుబంధ పోషకాహారం గురించి ఆమె వివరించారు. మనం రోజూ తీసుకునే ఆహారంలో స్థానికంగా పండించే ఆహార ధాన్యాలు, తృణ ధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలని ఆమె అవగాహన కల్పించారు. అనంతరం శ్రీనిధి అనే గర్భిణికి సీమంతం జరిపించారు. సర్పంచ్ వరమ్మ, పాల్గొన్నారు.

పొగాకు అత్యధిక ధర రూ.358

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో మంగవారం నిర్వహించిన వేలంలో అత్యధిక ధర రూ.358 పలికింది. ఆలకూరపాడు, అనంతవరం, రావివారిపాలెం, జయవరం, పాలేటిపాడు గ్రామాలకు చెందిన రైతులు 995 బేళ్లను వేలానికి తీసుకురాగా అందులో 864 బేళ్లను కొనుగోలు చేసి 131 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.195, సరాసరి రూ.319.47గా నమోదైంది. వేలంలో 45 మంది వ్యాపారులు పాల్గొన్నా రు.

కొండపి (సింగరాయకొండ): కొండపి వేలం కేంద్రంలో నిర్వహించిన వేలంలో సరాసరి ధర రూ.311.51 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. చతుకుపాడు, కె.అగ్రహారం, మూగచింతల, గుర్రపడియ, నెన్నూరుపాడు గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 1350 బేళ్లను తీసుకురాగా 1160 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేసి 190 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.190, సరాసరి ధర రూ.311గా నమోదైంది.

వర్షంతో పైర్లకు ఊపిరి

- జీవం పోసుకున్న కంది, సజ్జ..
- జోరుగా సాగుతున్న పొగనాట్లు
- డివిజన్‌లో సరాసరిన 49.5 మి. మీల వర్షపాతం నమోదు



వరి నాడుమళ్ల కళ కళ

కనిగిరి రూరల్:

మూడు రోజులుగా కనిగిరి ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు సాగులో ఉన్న ఖరీఫ్ పంటలు ఊపిరి పీల్చుకున్నాయి. కనిగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఈ ఏడాది ఖరీఫ్ సాగు విస్తీర్ణం భారీగా తగ్గింది. అయితే మూడు రోజుల నుంచి పడుతున్న చిరుజల్లుల వర్షానికి పంటలకు జీవం వచ్చినట్లైంది. ఇప్పటి వరకు దుక్కులు దున్ని, పంటలు సాగు చేయని భూమిలో కొత్తగా రైతులు పంటలు సాగుకు చేసుకునే సిద్ధమయ్యారు. కనిగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఆరు మండలాల్లో ఖరీఫ్ సాదారణ విస్తీర్ణం 20,928 హెక్టార్లు కాగా.. ఇప్పటి వరకు 6,493 హెక్టార్లు మాత్రమే పడింది. అందుల్లో అత్యధికంగా దాదాపు 12 వేల హెక్టార్ల వరకు పడే కంది.. సగం అంటే 5,383 హెక్టార్లు మాత్రమే పండినట్లు నివేదికలున్నాయి. వరి 88 హెక్టార్లు, సజ్జ 902 హెక్టార్లు, మొక్కజొన్న 35 హెక్టార్లు, ఆముదాలు 21 హెక్టార్లు, పొద్దుతిరుగుడు 17 హెక్టార్లు పడినట్లు అధికారులు వెల్లడించారు.



జీవం పోసుకున్న కంది

పనుల్లో రైతులు బిజీబిజీ..

వర్షాలకు రైతన్న పొలంలో బిజీ బిజీగా మారాడు. ఈ వర్షాలకు కంది, వరి, పొగాకు సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో కంది విత్తనాలు విత్తుతుండగా.. ఎక్కువ శాతం గ్రామాల్లో పొగనాట్లు, వరి నాట్లు జరుగుతున్నారు. కనిగిరిలోని అన్ని గ్రామాల్లో పొగనాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. డివిజన్‌లోని 13 మండలాల్లో సరాసరిన సరాసరి 49.5 మి.మీ వర్షపాతం కనిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలోని 13 మండలాల్లో శనివారం 301.6 మి.మీ వర్షపాతం నమోదు కాగా, సరాసరిన 23.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆదివారం డివిజన్‌లో 644.4 మి.మీ వర్షపాతం నమోదు కాగా సరాసరిన 49.5 మి.మీ వర్షపాతం నమోదు జరిగింది. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు కనిగిరి మండలంలో 44.2 మి.మీ, వెలిగండ్లలో 35.2 మి.మీ, హెచ్‌ఎంపాడులో 41.0, పామూరులో 34.2, సీఎస్‌పురంలో 25.8, పీసీపల్లిలో 27.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.



ముమ్మరంగా పొగనాట్లు



వర్షం రైతులకు ఎంతో మేలు:

గత రెండు రోజుల నుంచి కనిగిరి ప్రాంతంలో కురుస్తున్న వర్షం రైతులకు ఎంతో మేలు చేస్తోంది. ఇప్పటికే వేసిన పైర్లకు జీవం పోసింది. కొత్త పంటలను నెలాఖరు వరకు సాగు చేయవచ్చు. వర్షంలో నేలలో తేమ శాతం పెరుగుతుంది. కందిని రైతులు విత్తుకుంటారు. వరి, పొగాకు నాట్లు పెరుగుతాయి.

వెంకట రమణ, ఏడీఈ, కనిగిరి

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా



వగ్గంపల్లెలో శంకర్‌రెడ్డి కుటుంబసభ్యులకు ఆర్థికసాయం చేస్తున్న దద్దాల నారాయణ

- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ

పామూరు: వైఎస్సార్ సీపీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని పార్టీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. మండలంలోని వగ్గంపల్లె, కంబాలదిన్నె, బొట్లగూడూరు గ్రామాల్లో మంగళవారం పార్టీ నాయకులతో కలిసి విస్తృత పర్యటన చేసి పలువురికి ఆర్థికసాయం, పలువురిని పరామర్శించారు. ఈ వగ్గంపల్లె గ్రామానికి వెళ్లి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బైరెడ్డి శంకర్‌రెడ్డి (40) కుటుంబసభ్యులను పరామర్శించి అన్ని వేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చి రూ.50 వేల ఆర్థికసాయం మృతుని కుటుంబసభ్యులకు అందజేశారు. అనంతరం మండలంలోని కంబాలదిన్నెలో పార్టీ నాయకుడు నక్కా మాల్యాద్రిని పరామర్శించి ఆరోగ్యంపై చర్చించి త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. బొట్లగూడూరులో ఎంపీటీసీ పోలినేని శ్రీనివాసులుతో కలిసి పార్టీ పటిష్టతపై చర్చించి స్థానిక సంస్థల ఎన్నికల నాటికి మరలా పార్టీ పూర్వవైభవం వచ్చేలా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్.సెంట్రింగ్‌చాంద్‌బాషా, అంబటి కొండారెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, పిచ్చాల తిరుపతిరెడ్డి, హజరత్‌రెడ్డి, నీలం శ్రీరాములు, నీలం, వెంకటేశ్వర్లు, శ్రీరాం శ్రీను, జె.ప్రహ్లాద, వెంకటనారాయణ, గంధం బాస్కర్, గుమ్మల్ల వెంకటేశ్వర్లు, మడతల చిరంజీవి, తేలుకుట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మిల్లెట్స్ ఎక్కువగా తీసుకోవాలి



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

కందుకూరు రూరల్: రోజూ తీసుకునే ఆహారంలో మిల్లెట్స్ ఎక్కువగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్.ప్రభావతి సూచించారు. మండలంలోని కొండముడుసుపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మహా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ స్థానికంగా ఇళ్లల్లో పండించే కూరగాయాలు తీసుకోవడం మంచిదన్నారు. ఎలాంటి రసాయనిక మందులు వాడని ఆహారం స్వయంగా పండించుకోవాలన్నారు. ఈ ఆహారం తీసుకోవడం వల్ల చిన్నారులకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయని చెప్పారు. కేవలం వరి బియ్యం అన్నమే కాకుండా చిరుధాన్యాలను తీసుకోవాలన్నారు. వీటితో తినుబండారాలు కూడా తయారు చేసుకొని తీసుకోవచ్చని చెప్పారు. గర్భిణులు, బాలింతలు తప్పని సరిగా పౌష్టికాహారం తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డి.మాల్యాద్రి, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.ఉమా మహేశ్వరి, రాజేశ్వరి, మస్తానమ్మ, మాధవి, మల్లేశ్వరి, ఆయాలు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు రూ.2 లక్షల సాయం

కనిగిరి రూరల్: విజయవాడలోని వరద ముంపు ప్రాంతాల్లోని బాధితులను ఆదుకునేందుకు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, విద్యాశాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు నియోజకవర్గంలోని వివిధ విద్యా సంస్థల యాజమాన్యలు, టీచర్లు సుమారు రూ.2లక్షల సాయం అందించినట్లు ఎంఈఓ– 2 సంఘ జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి తెలిపారు. ఆల్ఫా విద్యాసంస్థల అధినేత, న్యాయవాది జి.మాలకొండారెడ్డి రూ.15 వేలు సాయం అందచేశారు. ఎంఈఓలు యువీ నారాయణరెడ్డి, రాజాల కొండారెడ్డి, ఆర్ శ్రీనివాసులు, జీ సంజీవి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన

హనుమంతునిపాడు: విత్తనం నుంచి విత్తనం తీసే విధానంపై రైతులకు కనిగిరి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు కె.రమణరావు అవగాహన కల్పించారు. మండలంలోని హాజీపురం, ఉపేంద్రాపరం గ్రామాల్లో పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా కంది పంట సాగు నుంచి పంట వచ్చే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏఓ కేవీ రమణ, ఏఈఓ గోపిక్రిష్ణ, వీఏఏలు నవ్య, పి.వెంకటరెడ్డి, ఎం.వెంకటేశ్వరెడ్డి, రామసుబ్బారెడ్డి, జయరావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

కనిగిరి రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారంలో భాగంగా పట్టణంలోని ఇందిరా కాలనీ, బీసీ కాలనీ, గార్లపేట రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వార్డుల్లోని మురికి నీటి కాలువల పరిశుభ్రతకు, డంపింగ్ పాయింట్ల వద్ద నిల్వ ఉన్న చెత్తను, వ్యర్థాలను తక్షణం తొలగించాలన్నారు. జ్వరా లక్షణాలు కన్పిస్తే తక్షణం వైద్యశాలకు వెళ్లాలని సూచించారు.

250 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక గార్లపేట రోడ్డులో డాక్టర్ ఖాజావలి(బాషా), ఎస్‌కే అబ్దుల్ బషీర్, కె.ప్రేమ్‌కుమార్‌ల వర్ధంతి పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ ప్రారంభించారు. వైద్య శిబిరంలో కిమ్స్ వైద్యులు డాక్టర్ ఏవీ కృష్ణారెడ్డి, బండి కిరణ్ జ్యోతి, రామాంజనేయులు, వైద్య సేవలందించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి 250 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు. ఖాజా హుస్సేన్, మస్తాన్ షరీఫ్, సమీర్, తనీర్, షరీఫుద్దీన్, షాహిద్, సుమైర్, సుమన్, అక్బర్, రాజ్ కుమార్, డాక్టర్ రసూల్, థెరిస్సా సేవా సమితి అధ్యక్షుడు సయ్యద్ నాయబ్ రసూల్, కోఆప్షన్ సభ్యుడు జి. అబ్రహాం లింకన్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం అందరి బాధ్యత



మాట్లాడుతున్న సీఐ భీమానాయక్

పామూరు: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇందులో విద్యార్థులు భాగస్వాములు కావాలని సీఐ ఎం భీమానాయక్ అన్నారు. స్థానిక ఒమీగా జూనియర్ కళాశాల, వివేకా డిగ్రీ కళాశాలలో మంగళవారం డ్రగ్స్ వాడటం ద్వారా అనర్థాలు, హెల్మెట్ వినియోగించకపోతే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ మూర్తి మహాలక్ష్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం విద్యాశాలలకు పాకుతుందన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ విక్రయించినా, ఉపయోగిస్తున్నా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బైక్‌లపై ప్రయాణించే సమయంలో ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలన్నారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సత్యవతి

కొండపి (సింగరాయకొండ): కొండపి మండలంలోని కె.ఉప్పలపాడు జెడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్లో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చైల్డ్ ఫండ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సత్యవతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎయిడ్స్ ఏ విధంగా సోకుతుందో వివరించారు. యువత జాగ్రత్తగా ఉండాలని సూఇచంచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి. సూసన్నకుమార్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

హనుమంతునిపాడు: మండలంలోని మొరవారిపల్లి పొలాల్లో పేకాట శిబిరంపై ఎస్సై కె.శివనాగరాజు సిబ్బందితో కలిసి దాడి చేశారు. దాడిలో నలుగురు జూదరులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.7,120 నగదు, రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

కందుకూరు: నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని ఈ నెల 6వ తేదీ వరకు సీపీఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళనల్లో భాగంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో వాల్ పోస్టర్‌లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.సరేష్బాబు మాట్లాడుతూ రోజు రోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలను తగ్గించాలని జాతీయ సమితి పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. నిత్యావసర ధరల తగ్గించాలని, ధరలు స్థిరీకరణకు బడ్జెట్‌లో తగు నిధులు కేటాయించి సక్రమంగా వినియోగించాలన్నారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రతిష్ట పరిచి కేరళ తరహాలో నిత్యావసర వస్తువులను సబ్సిడీ రేట్లకే చౌక డిపోల ద్వారా అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వై.ఆనంద్ మోహన్, సీపీఐ నాయకులు ఎం.లక్ష్మీనారాయణ, బాల బ్రహ్మాచారి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పామూరు: ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఐ జాతీయ సమితి పిలుపుమేరకు ఈ నెల 6వ తేదీన ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐమండల కార్యదర్శిపోతుల ప్రభాకర్ అన్నారు. స్థానిక కార్యాలయంలో ధర్నా కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వం అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలన్నారు. వజ్రాల సుబ్బారావు, మోహన్‌రావు, ప్రసాదు, వెంకట్‌రెడ్డి, ఫ్రాన్సిస్, నారాయణ, రమేష్, సుధాకర్ పాల్గొన్నారు.

ధర్మారావును పరామర్శించిన దద్దాల



ధర్మారావును పరామర్శిస్తున్న దద్దాల

కనిగిరి రూరల్: ప్రమాదవశాత్తు కాలు విరిగి ఇంట్లో ఉన్న ఆర్యవైశ్య ప్రముఖుడు, బాబా దేవస్థాన కమిటీ నాయకుడు ముచర్ల ధర్మారావును వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ మంగళవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి, వాసవీసత్ర సముదాయాల జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, కౌన్సిలర్ దేవకి రాజీవ్, చింతం శ్రీనివాసుల యాదవ్, సర్పంచ్ స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, ఆర్యవైశ్య నాయకులు మాదాల సూరిబాబు, మాదాల వెంకట సుబ్బారావు, వెంగళరావు గుప్తా, తడికమళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక



ఎన్.వెంకటరామయ్య



సీహెచ్.సునీతాదేవి



ఇ.సరోజనమ్మ



జి.రత్నమ్మ

సీఎస్‌పురం(పామూరు): మండలంలో నలుగురు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరు ఈనెల 5వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలు విద్యాశాఖాధికారి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, మెడల్ అందుకోనున్నారు. మండలంలోని శీలంవారిపల్లి కేపీఎల్ఎన్ నగర్ జెడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ ఎన్.వెంకటరామయ్య, కోవిలంపాడు ఎంపీయూపీఎస్ ఎస్‌జీటీ సీహెచ్.సునీతాదేవి, దర్శిగుంట్ల ఎంపీపీఎస్ ఎస్‌జీటి ఇ.సరోజనమ్మ, డీజీపేట ఎంపీపీఎస్ ఎస్‌జిటి జి.రత్నమ్మలు ఎన్నికయ్యారు. వీరిని ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డితోపాటు మండల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఆక్వా కంపెనీల దాతృత్వం



ఆహార పొట్లాల లారీని విజయవాడ పంపిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, కంపెనీ ప్రతినిధులు

సింగరాయకొండ: వరదలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న విజయవాడ వాసులను ఆదుకునేందుకు సింగరాయకొండ, జరుగుమల్లి మండలాల్లోని ఆక్వా ప్రాసెసింగ్ ప్లాంట్ల ప్రతినిధులు ముందుకు వచ్చారు. దేవి సీఫుడ్స్ కంపెనీ, జీవీఆర్ ఆక్వా కంపెనీలు ఒక్కొక్కరు 10 వేల ప్యాకెట్లు, ముస్నంగి సీ ఫుడ్స్ కంపెనీ 5 వేల ప్యాకెట్ల చొప్పున మొత్తం 25 వేల ప్యాకెట్లను ఒంగోలులోని ఫంక్షన్ హాలులో తయారు చేయించి కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆధ్వర్యంలో విజయవాడ పంపించారు. ఆక్వా కంపెనీ ప్రతినిధులు గిరి, శ్రీనివాసరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.


హోటల్‌లో చోరీ



చోరీ జరిగిన వినాయక్ హోటల్

టంగుటూరు: స్థానిక వినాయక హోటల్‌లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుల వివరాల ప్రకారం.. స్థానిక కొండపి రోడ్డులో ఉన్న వినాయక హోటల్‌లో దుండగలు వెనుక వైపు నుంచి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.6 వేల నగదు అపహరించారు. హోటల్ యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అదే విధంగా స్థానిక సింగరాయకొండ రోడ్డులోని వీరమ్మ కాంపెక్స్‌లో ఉన్న కొరియర్ సరీస్‌సుకు వచ్చి వ్యక్తి నిర్వాహకులను మాటల్లో పెట్టి అక్కడే ఉన్న రూ.13 వేల విలువైన ఫోన్‌ను అపహరించాడు. ఫోన్ మాయమైందని ఆలస్యంగా గమనించిన నిర్వాహకులు సీసీ టీవీ పుటేజీ పరిశీలించగా నిందితుడు ఫోన్ చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వినాయక ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐ కె.వెంకటేశ్వర్లు

కందుకూరు రూరల్: వినాయక చవితి ఉత్సవాలకు తప్పని సరిగా పోలీస్ అనుమతులు తీసుకోవాలని సీఐ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహం ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారు, నిమజ్జనం ఎప్పుడు, ఏమైనా కార్యక్రమాలు నిర్వహిస్తే వాటి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. పండుగను పండుగలా చేసుకొని కక్షసాధింపులు, ఘర్షణలు లేకుండా ఉత్సవ కమిటీ బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందన్నారు. నిబంధనలు పాటించకపోతే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే విధంగా సైబర్ క్రైమ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పండుగల సీజన్‌లో ఆన్‌లైన్‌లో మీ ఫోన్ నంబర్‌కు లక్కీ డ్రా తగిలిందని, పథకాల్లో లబ్ధిదారులు అయ్యారు ఓటీపీ చెప్పండని ఫోన్లు చేస్తుంటారని చెప్పారు. ఇలాంటి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్లు వస్తే స్పందించవద్దన్నారు. అదే విధంగా ఈ లింక్ టచ్ చేస్తే ఫోన్లుకు రిచార్జ్ ఫ్రీ, డేటా ఫ్రీ అని లింక్ మెసేజ్‌లు వస్తుంటాయని, వాటిని టచ్ చేయవద్దన్నారు. అదే విధంగా మనకు తెలియని నంబర్‌తో వీడియో కాల్ వస్తుందని, వీడియో కాల్‌లోకి వెళ్లారంటే ఇక అంతే మన ఫొటోలో, మన కాంటాక్ట్ నంబర్లు వారికి వెళ్లిపోతాయన్నారు. వీడియో కాల్‌లో వీరితో మాట్లాడామంటే ఇక అంతే సంగతులు ముఖం మాత్రం మనదే మిగిలిన బాడీ మారిపోతుంది. ఇక ఆ ఫొటోలు, వీడియో మనకు షేర్ చేసి బ్లాక్‌మెయిన్ చేస్తుంటారన్నారు. ఇలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఏరువారిపల్లి మాజీ సర్పంచ్ మృతి

కనిగిరి రూరల్: మండలంలోని ఏరువారిపల్లి మాజీ సర్పంచ్, సీపీఐ సీనియర్ నాయకురాలు ఎనుబరి అన్నమ్మ(50) అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె భౌతికకాయానికి మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, మాజీ కౌన్సిలర్ సయ్యద్ నాయబ్ రసూల్, కౌన్సిలర్ పసుపులేటి అరుణోదర్, మాజీ ఏఎంసీ డైరక్టర్ బొట్టు శ్రీను, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ యాసీన్ తదితరులు నివాళులర్పించారు.

ఆధునిక పద్ధతులపై విద్యాబోధన చేయాలి



విద్యార్థులు, అధ్యాపకులతో యూనివర్సిటీ అధికారులు

సీఎస్‌పురం(పామూరు): ఆధునిక వ్యవసాయ ఉత్పత్తులు, పద్ధతులతో కూడిన విద్యాబోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని గుంటూరు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ ఏవీ రమణ, డాక్టర్ పి.మునిరత్నం, వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి.అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని శీలంవారిపల్లె కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి పలు సూచనలు చేశారు. డిజిటల్ తరగతి గదులు, హాస్టల్ వసతులు, కంప్యూటర్ ల్యాబ్, పంటపొలాలు, స్పోర్ట్స్, డిపార్ట్‌మెంట్ ల్యాబ్స్, విద్యార్థులకు మౌలిక వసతులను పరిశీలించి నిర్వహణపై పలు సూచనలు చేశారు. పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కదిరి పార్థసారది, వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ నున్నా త్రిమూర్తులు, ఉద్యానవన కళాశాల డీన్ డాక్టర్ వీరన్నగౌడ్, డాక్టర్ రామస్వామి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రేలలో మొక్కల పెంపకంపై నైపుణ్యాభివృద్ధి శిక్షణ

కందుకూరు రూరల్: కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ జి.ప్రసాద్ బాబు, శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతులకు, మహిళా రైతులకు, గ్రామీణ యువతకు ప్లాస్టిక్ ట్రేలలో కూరగాయలు, పూల మొక్కల పెంపకంపై ఐదు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్లాస్టిక్ ట్రేలు, కోకోపీట్ (మాగబెట్టిన కొబ్బరి పీచు), జీవ శిలీంద్రనాశినులైన ట్రైకోడెర్మ విరిడే, సూడోమోనాస్‌తో షెడ్ నెట్‌లో మిరప, బంతి, టమాటా, వంగ, పొగాకు వంటి మొక్కలు, కూరగాయల నారును పెంచే విధానంపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. రైతులకు ప్రత్యక్షంగా ప్లాస్టిక్ ట్రేలలో కోకోపీట్ ఎలా నింపాలి, తెగుళ్ల రాకుండా ట్రైకోడెర్మ విరిడి, సూడోమోనాస్ కలిపే విధానాన్ని తెలియజేశారు. నారులో పురుగుల నియంత్రణను, పోషకాల యాజమాన్యాన్ని చేసి చూపించారు. ట్రేలలో నారు పెంచుకోవడం ద్వారా మొక్కలు దృఢంగా, బలంగా ఉండి త్వరగా ప్రధాన పొలంలో నాటినప్పుడు నిలదొక్కుకొని రోగాలు తట్టుకొని అధిక దిగుబడినిస్తాయన్నారు. రైతులు ఇంటి వద్దనే నారు పెంచుకొని నాణ్యమైన నారును నాటుకోవడం ద్వారా ఖర్చు తగ్గించుకొని అధిక ఆదాయం పొందవచ్చని చెప్పారు. అలాగే పలుకూరు, పోకూరు, శాఖవరం దత్తత గ్రామ రైతులకు మినుములో పల్లాకు తెగులు తట్టుకొని పాలిష్ గింజ కలిగిన ఎల్‌బీజీ-904 రకాన్ని ప్రదర్శనా క్షేత్రాల కింద రైతులకు ఇచ్చారన్నారు. ఈ రకం 85 రోజుల పంట కాలం కలిగి ఎకరాకు 7 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడినిస్తుందని రైతులు ఈ రకాన్ని పండించుకొని వచ్చిన విత్తనాన్ని మళ్లీ విత్తనం కింద ఇతర రైతులకు అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, మాయాంక్, వెంకటేష్, జ్యోతి, విహారిక, వివేక్, శ్రీరంగ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేయించాలి

వెలిగండ్ల: రైతులు సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా ఈ -పంట నమోదు చేయించాలని వ్యవసాయాధికారి ఎస్ రంగాకృష్ణ అన్నారు. మండలంలోని గోకులంలో మంగళవారం ఈ-పంట నమోదును ఏఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన రైతులు ఈ నెల 15 లోగా నమోదు చేయించాలన్నారు. ఈ-పంట నమోదుపై ఈ నెల 19 నుంచి 24 వరకు సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శన నిర్వహిస్తారన్నారు. ఈ నెల 25 నుంచి 28 వరకు సవరణ, 30వ తేదీ ఈ -పంట తుదిజాబితా ప్రకటిస్తారన్నారు.ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు పంట ఇన్సూరెన్స్, పంట నష్టపరిహారం , ప్రభుత్వానికి పంట అమ్ముకునేందుకు అర్హులవుతారన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బందికి తగిన పత్రాలు సమర్పించి, ఈ-పంట చేయించుకోవాలన్నారు